సాక్షి
నిజామాబాద్
ఆదివారం | 5 | మే | 2024



ఓటు వజ్రాయుధం
ఓటు వజ్రాయుధం వంటిదని, ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని ట్రెయినీ ఐపీఎస్ చైతన్యరెడ్డి అన్నారు.
- IIలో ▸



ఈవీఎంలు సిద్ధం చేయాలి
లోక్‌సభ ఎన్నికలకు ఈవీఎంలను సిద్ధం చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు.
- IIలో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
44.3 /25.4
ఉదయం నుంచే ఎండ తీవ్రత బాగా పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్


జాకోరాలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత
సుభాష్‌నగర్: జిల్లాలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. శనివారం వర్ని మండలంలోని జాకోరాలో సీజన్‌లోనే అత్యధికంగా గరిష్ట ఉష్ణోగ్రతలు 46.4 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతుండటంతో రాత్రివేళ ఉక్కపోత తీవ్రమైంది. పగలు వడగాలులు వీస్తున్నాయి. నిజామాబాద్ నార్త్ మండలంలో 45.6, ముప్కాల్ మండలం వేంపల్లిలో 45.5, కమ్మర్‌పల్లి, ఎడపల్లిలో 44.8, జక్రాన్‌పల్లి, మోర్తాడ్, మోస్రా, సాలూర, బోధన్‌లో 44.6, వేల్పూర్, నిజామాబాద్ సౌత్‌లో 45.5 డిగ్రీలుగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు అత్యధికంగా చందూర్‌లో 38.4 డిగ్రీలు, జక్రాన్‌పల్లిలో 37.9, జాకోరాలో 37.8, భీంగల్‌లో 37.6, కొరట్‌పల్లి, నిజామాబాద్ నార్త్‌లో 37.4, ముప్కాల్‌లో 37.0 డిగ్రీలు నమోదయ్యాయి.

సదరం క్యాంపు తేదీలు ఖరారు
డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో మే నెలకు సంబంధించిన సదరం క్యాంపులు ఖరారయ్యాయి. ఈ నెల 8, 15, 22 తేదీల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ఐదు విభాగాల్లో 390 స్లాట్లు కేటాయించగా, 6వ తేదీ (సోమవారం) ఉదయం 11:30 గంటలకు మీ సేవా కేంద్రాల్లో స్లాట్లు విడుదల చేస్తామన్నారు. జిల్లాలోని దివ్యాంగులు స్లాట్ బుకింగ్ చేసుకుని రసీదులో నమోదైన తేదీల్లో సదరం క్యాంపునకు హాజరు కావాలన్నారు. హాజరయ్యే వారు సంబంధిత మెడికల్ రిపోర్టులు, ఎక్స్‌రేలు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ కో ఆర్డినేటర్ల నియామకం
ఖలీల్‌వాడి: నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ మెయిన్ కమిటీ సభ్యుడిగా ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డితోపాటు సమన్వయకర్తలను నియమిస్తూ టీపీసీసీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ నగర అధ్యక్షుడు కేశ వేణు, పార్లమెంటరీ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పంచరెడ్డి చరణ్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు రాజనరేందర్ గౌడ్‌లను కో ఆర్డినేటర్లుగా నియమించారు. వారు మాట్లాడుతూ.. నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో జీవన్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

పది కేంద్రాల్లో నీట్ పరీక్ష
నిజామాబాద్‌అర్బన్: మెడికల్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆదివారం ఎన్‌టీఏ నిర్వహించనున్న నీట్ పరీక్షకు జిల్లాలోని పది సెంటర్లలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కోఆర్డినేటర్ భాస్కర్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. ఆ తర్వాత వచ్చే విద్యార్థులకు లోనికి అనుమతి లభించదు. విద్యార్థులు చేతి గడియారాలు, ఎల్రక్టానిక్ వస్తువులు, విలువైన ఆభరణాలతో పరీక్ష కేంద్రానికి రావొద్దని కో ఆర్డినేటర్ స్పష్టం చేశారు. విద్యార్థులు పాస్‌పోర్టు సైజ్‌ఫొటో, ఏదైన ఒరిజినల్ గుర్తింపు కార్డు (ఆధార్, పాన్ కార్డు) వెంట తీసుకుని పరీక్ష కేంద్రానికి వెళ్లాలి. సందేహాల నివృత్తికి 8978198421 నంబర్‌ను సంప్రదించాలన్నారు.


జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాలు..
1. ఎస్ఎస్ఆర్ డిస్కవరీ స్కూల్, మాధవ్ నగర్ 2.ఎస్ఎస్ఆర్ సీబీఎస్ఈ స్కూల్, జన్నేపల్లి గ్రామము, నవీపేట్ మండలం 3.ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజ్ ఖలీల్ వాడి 4. నాలెడ్జ్ పార్క్ ఇంటర్నేషనల్ స్కూల్, బోధన్ రోడ్ 5. ప్రెసిడెన్సీ హైస్కూల్ , మోపాల్ 6. నిర్మల హృదయ స్కూల్, సుభాష్ నగర్ 7. విజయ హైస్కూల్, ముబారక్ నగర్ 8. క్షత్రియ ఇంజినీరింగ్ కాలేజ్, ఆర్మూర్9. నవ భారతి గ్లోబల్ స్కూల్, దాస్ నగర్ 10. కాకతీయ మహిళా ఇంజినీరింగ్ కళాశాల, మాణిక్ బండార్.

కూలీల సంఖ్య పెంచాలి


వర్ని(మోస్రా): ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని డీఆర్డీవో సాయాగౌడ్ అధికారులకు సూచించారు. మోస్రా మండలం గోవూర్‌లో ఉపాధి హామీ పనులను శనివారం పరిశీలించారు. ఎండ తీవ్రంగా ఉన్నందున కూలీలకు వడదెబ్బ తగలకుండా చూడాలని, ఉదయం 6 నుంచి 11 గంటల వరకు పనులు చేపట్టేలా చర్యలను చేపట్టాలని అధికారులకు సూచించారు. ఏపీవో సురేశ్, టీఏ అంబర్ సింగ్ ఉన్నారు.

వ్యూహాలకు పదును

- సొంత వ్యక్తుల ద్వారా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి సమాచారం తెప్పించుకుంటున్న అభ్యర్థులు
- ప్రచారానికి మిగిలింది ఆరు రోజులే
- పోలింగ్‌కు కౌంట్‌డౌన్ నేపథ్యంలో పార్టీల హడావుడి



నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాల పరిధిలో త్రిముఖ పోటీ నేపథ్యంలో ఎవరి ఓట్లు ఎటు చీలిపోతాయో, ఎవరి ఓట్లు క్రాస్ అవుతాయో ? అంతు చిక్కని పరిస్థితి నెలకొంది. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ సన్నిహితులు, అనుచరులతో ఎప్పటికప్పుడు వ్యూహప్రతివ్యూహాలను పన్నుతున్నారు. ప్రత్యర్థుల బలం, బలహీనతలను సమీక్షించుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి ఆరు రోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో ప్రధాన పార్టీలు, అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులను చేర్చుకునేందుకు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రాధాన్యత నిస్తున్నాయి. ప్రత్యర్థుల బలాలు, బలహీనతలను బేరీజు వేసుకుంటూ ఎదుటి పార్టీ వద్దనున్న ముఖ్య నాయకులను తమ పార్టీలో చేర్చుకునేలా ప్రణాళికలు రచించి అమలు చేస్తున్నారు. ప్రతిరోజు ప్రచారం ముగిసిన తరువాత తమ సన్నిహితులు, నమ్మకమైన అనుచరులతో కలిసి రాత్రి సమయాల్లో ఎత్తుగడలపై ఆలోచనలు చేస్తున్నారు. నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాల పరిధిలో త్రిముఖ పోటీ నెలకొనడంతో ఎవరి ఓట్లు ఎటు చీలిపోతాయో, ఎవరి ఓట్లు క్రాస్ అవుతాయో అనే విషయంలో అంతుచిక్కని పరిస్థితి నెలకొంది. త్రిముఖ పోరులో ఎవరి గెలుపోటములను ఎవరు ప్రభావితం చేస్తారనేది అంచనాలకు అందని పరిస్థితి ఏర్పడింది.

■ ప్రత్యర్థుల వద్ద పనిచేస్తున్న పలువురిని మచ్చిక చేసుకుంటున్న అభ్యర్థులు వారిచ్చే సమాచారం ఆధారంగా ఎప్పటికప్పుడు ప్రణాళికలు రచిస్తున్నారు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఎత్తుగడలు మార్చుకుంటూ వస్తున్నారు. ఎక్కడికక్కడ సొంత నిఘా వ్యవస్థను ఏర్పా టు చేసుకుని ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలించుకుని ప్రణాళికలు మార్చుకుంటున్నారు. త్రిముఖ పోటీ నేపథ్యంలో అభ్యర్థులు కూడికలు, తీసివేతల తో ఆయా సమీకరణలను సరిచూసుకుంటూ విశ్లేషణలు చేసుకుంటున్నారు. కులసంఘాలతో నిర్వహించిన సమావేశాల్లో వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా, పోలింగ్ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా సంఘాలు, వర్గాల్లో ఆలోచనలకు సంబంధించి ఎలాంటి మార్పులు వచ్చాయన్న వివరాలను సైతం సేకరిస్తున్నారు. ప్రత్యర్థి అభ్యర్థుల్లో ఎవరు ఏ వర్గానికి చెందిన ఓట్లను, ఏ మేరకు చీల్చుకుంటారనే విషయమై విశ్లేషణలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఏ అభ్యర్థి ఏ వర్గానికి చెందిన ఓట్లను ఎంత శాతం చీల్చుకుంటే తమకు ప్రయోజనం కలుగుతుందో, లేనిపక్షంలో తమకు నష్టం కలుగుతుందా అనే లెక్కలతో ఎత్తులు వేసుకుంటున్నారు. పోలింగ్ కౌంట్‌డౌన్ నడుస్తున్న నేపథ్యంలో ప్రతి నిముషాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా అగ్రనేతల పర్యటనల నేపథ్యంలో తగిన హామీలు ఇప్పించుకుని ఓట్లు రాబట్టుకునేందుకు అభ్యర్థులు ప్రణాళికలు రచిస్తున్నారు.

జహీరాబాద్‌లో..

■ జహీరాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో సిట్టింగ్ ఎంపీ బీబీపాటిల్ బీజేపీలో చేరి హోరాహోరీగా తలపడుతున్నారు. సీనియర్ నేత సురేశ్ షెట్కార్ గెలుపే లక్ష్యంగా పోరాడుతున్నారు. మంచి పేరున్న బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ సైతం త్రిముఖ పోరులో గెలుపే లక్ష్యంగా శక్తివంచన లేకుండా ప్రచారం చేస్తున్నారు. కులసమీకరణలు తమకు మేలు చేసేవిధంగా అభ్యర్థులు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ఇదిలా ఉండగా ఈ అభ్యర్థులంతా స్థానికంగా బలమైన నాయకులే అయినప్పటికీ, జాతీయ నాయకులు, అధినాయకత్వం ప్రభావం కూడా ఈ ఎన్నికల్లో ప్రధానం కానుంది. వివిధ జాతీయ స్థాయి అంశాలు ఈ ఎన్నికల్లో ప్రభావం చూపనున్న నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు జాతీయ నాయకుల చరిష్మాను, బీఆర్ఎస్ శ్రేణులు మాత్రం కేసీఆర్ పలుకుబడి కలిసొస్తాయని నమ్ముతున్నారు.

■ నిజామాబాద్‌లో సిట్టింగ్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ మోదీ చరిష్మా, పసుపు బోర్డు విషయంలో మాట నిలుపుకున్నామనే అంశంతో మరోసారి గెలిచేందుకు వ్యహాలు పన్నుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి తన సీనియారిటీతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం అంశంతో పాటు నిజాం షుగర్స్‌ను తెరిపించే ప్రక్రియ ప్రారంభించినట్లు చెబుతూ ప్రచారంలో దూసుకెళుతున్నారు. బీఆర్ఎస్ నుంచి మాస్ లీడర్‌గా పేరుపొందిన సీనియర్ నాయకుడు బాజిరెడ్డి గోవర్ధన్ సైతం గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు.

నేడు నగరానికి అమిత్ షా



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీ అర్వింద్

సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ అర్వింద్

సుభాష్‌నగర్: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆదివారం నగరంలో పర్యటించనున్నారు. ఎంపీ అర్వింద్‌కు మద్దతుగా గిరిరాజ్ కాలేజీ మైదానంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్న విశాల జనసభలో ఆయన పాల్గొననున్నారు. సభ ఏర్పాట్లను ఎంపీ, బీజేపీ అభ్యర్థి అర్వింద్ ధర్మపురి శనివారం సాయంత్రం పరిశీలించారు. నిర్వాహకులను పలు సూచనలు, సలహాలు చేశారు. అమిత్ షా పర్యటన నేపథ్యంలో కేంద్ర బలగాలు ఇప్పటికే గిరిరాజ్ కళాశాల మైదానాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. కేంద్ర బలగాలతో పాటు రాష్ట్ర పోలీసులు కూడా సభకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జీజీ కళాశాల మైదానంలోనే హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. ఎంపీ వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, న్యాలం రాజు, ఎర్రం సుధీర్, నాగోళ్ల లక్ష్మీనారాయణ ఉన్నారు.



గిరిరాజ్ కళాశాల మైదానంలో అమిత్‌షా పర్యటన నేపథ్యంలో చేసిన ఏర్పాట్లు

పడిపోయిన టమాట ధర

మోర్తాడ్(బాల్కొండ): టమాట సాగు చేసిన రైతులు ధర దక్కక ఆందోళన చెందుతున్నారు. నిన్న మొన్నటి వరకు ఒక పెట్టె టమాటకు రూ.200 వరకు అందుకున్న రైతులు ఇప్పుడు రూ.100తోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. రిటేల్ మార్కెట్‌లో కిలో టమాట ధర రూ.20 పలుకుతున్నా హోల్‌సెల్ వ్యాపారులకు విక్రయించిన పంటకు కిలోకు రూ.5 మాత్రమే అందుకుంటున్నారు. ఒక పెట్టెలో 20 కిలోల టమాటలు పడతాయి. మోర్తాడ్, వేల్పూర్, కమ్మర్‌పల్లి, ఆర్మూర్, బాల్కొండ, నందిపేట్, మాక్లూర్, ముప్కాల్, మెండోరా, జక్రాన్‌పల్లి మండలాల్లో టమాటను విస్తారంగా సాగు చేశారు. పొరుగు జిల్లాలకు ఎగుమతులు సాగుతున్నాయి. ఎగుమతులకు ఇప్పుడు డిమాండ్ లేకపోవడంతోనే టమాట ధర పడిపోయిందని వ్యాపారులు చెబుతున్నారు. అలాగే మహారాష్ట్ర నుంచి టమాట దిగుమతి అవుతుండటంతో ఇక్కడి పంటకు ధర ఆశించిన విధంగా లభించడం లేదని తెలుస్తోంది. ఒక్కో సందర్భంలో టమాట పండించిన రైతులు ఒక ఎకరానికే రూ.లక్షల్లో ఆదాయం ఆర్జిస్తే ఇప్పుడు కనీసం కూలి సొమ్ముకు సమానంగా ఆదాయం రావడం లేదు.



ఆదాయం తగ్గిపోయింది



టమాట ధర పడిపోయి ఆదాయం తగ్గిపోయింది. నిన్న మొన్నటి వరకు ఒక పెట్టె టమాటకు రూ.200 లభిస్తే ఇప్పుడు ధర సగం పడిపోయింది. మార్కెట్‌ను అంచనా వేయకపోవడంతో టమాట సాగు చేసిన రైతులకు నష్టం తప్పడం లేదు.
– జైడి చిన్నారెడ్డి, రైతు, మోర్తాడ్

నిఘా నీడలో ఎన్నికలు

- 360 డిగ్రీల కెమెరాలతో పర్యవేక్షణ

ఖలీల్‌వాడి: లోకసభ ఎన్నికల్లో నిబంధనలు పకడ్బందీగా అమలు చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం నిఘా పటిష్టం చేసింది. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి సాంకేతికతను ఉపయోగించుకుంటుంది. నగదు, మద్యం అక్రమ రవాణా, పంపిణీని అడ్డుకునేందుకు బృందాలను నియమించింది. శాసనసభ ఎన్నికలలో వినియోగించిన 360 డిగ్రీల కెమెరాలు సత్ఫలితాలు ఇవ్వడంతో ఈ ఎన్నికల్లో వినియోగిస్తున్నారు.

రాష్ట్ర కార్యాలయానికి అనుసంధానం

ఈ నిఘా బృందాల కారుకు 360 డిగ్రీ కోణంలో కెమెరాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు ప్రచారం, ఘర్షణలు, నగదు పంపిణీ, మద్యం, గిఫ్టులు ఇచ్చిన వాటిని ఈ కెమెరా రికార్డు చేస్తుంది. ఈ వీడియో ద్వారా అభ్యర్థులపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు చొప్పున ఈ కెమెరాలు ఉన్న వాహనాలను తిప్పుతున్నారు. ఈ కెమెరాలు రాష్ట్ర ఎన్నికల సంఘంకు అనుసంధానం చేశారు. స్థానికంగా జరిగే ఘటనలను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.




360 డిగ్రీల కెమెరాతో వాహనం

ఐదు రకాల బృందాలతో..

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఐదు రకాల నిఘా బృందాలు పని చేస్తున్నాయి. పోలీసులు, రెవెన్యూ, సహకార, ఇరిగేషన్ తోపాటు ఇతర శాఖలకు చెందిన అధికారులు వీటిలో పని చేస్తున్నారు. ఫ్లయింగ్ స్వాడ్స్‌లో పోలీస్ అధికారి, ఒక వీడియోగ్రాఫర్, స్టాటిక్ సర్వేలెన్స్‌లో డిప్యూటీ తహసీల్దార్, పోలీస్, ఎక్సైజ్, అటవీశాఖ సంబంధించిన అధికారులు ఉంటారు. వీడియో సర్వేలెన్స్ టీమ్ సభ్యులు పూర్తి స్థాయి పరిశీలిస్తారు. మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ బృందంలో గెజిటెడ్ అధికారితో పాటు పోలీస్, వీడియోగ్రాఫర్ ఉంటారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన, అభ్యర్థుల ప్రచారం, ఖర్చులపై వీరి నిఘా ఉంటుంది.

మోయలేని ఫీజుల భారం..

- ఏటా పెంచుతున్న ప్రైవేట్ పాఠశాలలు
- నిబంధనలు పట్టించుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు



నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టారీతిగా ఫీజులు పెంచుతున్నారు. పాఠశాల ఫీజుతోపాటు ల్యాబ్, లైబ్రరీ, స్పోర్ట్స్ ఇతర ఫీజులన్నీ కలిపి ట్యూషన్ ఫీజు కింద అందినకాడికి దండుకుంటున్నాయి. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఫీజులను నియంత్రించాల్సిన విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలో 476 ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు 1.50 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. కొన్ని పాఠశాలల్లో భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు. నగరంలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో ఎల్‌కేజీ విద్యార్థికి అన్ని ఫీజులు కలుపుకొని రూ.70 వేల వరకు వసూలు చేస్తున్నారు. వినాయక్‌నగర్‌లో అనుమతి లేకుండా కొనసాగుతున్న ఓ బడిలో రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తు అడ్మిషన్లు కొనసాగిస్తుంది. ఇటీవల కంఠేశ్వర్‌కు మార్చిన ఓ పాఠశాల 20 శాతం ఫీజులు పెంచింది.

అమలు కాని ఉత్తర్వులు

అధికారుల అలసత్వంతో ప్రైవేట్ పాఠశాలల ఆగడాలకు అంతులేకుండా పోయింది. రాష్ట్రంలో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం 2017లో ప్రొఫెసర్ తిరుపతిరావు నేతృత్వంలో కమిటీ వేసింది. ఆ కమిటీ 2018 మార్చిలో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తూ ఏటా 10శాతం ఫీజులను పెంచుకోవచ్చని ప్రతిపాదనలు చేసింది. కమిటీ సిఫార్సులను ప్రభుత్వం అమలు చేయలేదు. 2020 ఏప్రిల్‌లో ఫీజుల నియంత్రంచాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ట్యూషన్ ఫీజులను నియంత్రించాలని అధికారులకు ఆదేశించింది. కానీ ఈ ఉత్తర్వులు అమలు కావడం లేదు. విద్యా హక్కు చట్టం ప్రకారం పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజు వసూలు చేయొద్దు. కానీ జిల్లాలో అన్ని పాఠశాలలు రూ.1,000 నుంచి రూ.20,000 వరకు వసూలు చేస్తున్నాయి.

తనిఖీలు చేపడుతాం

జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి. అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల్లో తనిఖీలు చేపడుతాం. అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయాలి. – దుర్గాప్రసాద్, డీఈవో

బీజేపీకి గుణపాఠం చెప్పాలి

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నిజామాబాద్ రూరల్: మాయమాటలతో మభ్యపెట్టే బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గూపన్‌పల్లి, గుండారం గ్రామాల్లో శనివారం ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ధాన్యం క్వింటాలుకు రూ.మూడు వేలు అందిస్తామని హామీ ఇచ్చారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. అర్హులకు రేషన్ కార్డులు అందించలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు రోజులకే ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. బీడీ కార్మికుల పెన్షన్ కటాఫ్ డేట్ ఎత్తివేస్తామన్నారు. కాంగ్రెస్ ది లౌకిక వాదం అయితే, బీజేపీది మతతత్వ వాదం అన్నారు. దేశంలో రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన పార్టీ కాంగ్రెస్ అని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. బీజేపీ రాముడి పేరుతో ఓట్లు అడగడం సిగ్గు చేటన్నారు. రాముడు గుడిలో ఉండి.. భక్తి గుండెల్లో ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మల్కాపురం అనంత పద్మనాభ స్వామి ఆలయంలో జీవన్‌రెడ్డి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నర్సారెడ్డి, కిసాన్‌కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, నగేష్‌రెడ్డి, భూమారెడ్డి, బాగ్గిరి బాగారెడ్డి, ప్రవీణ్, సాయిరెడ్డి, భోజన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



గూపన్‌పల్లిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

పొలిటికల్ కార్నర్ ప్రచార పర్వం

మోదీ పాలనలో విశ్వగురువుగా దేశం

- ఎంపీ ధర్మపురి అర్వింద్

రెంజల్: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం విశ్వగురువుగా ఎదిగిందని ఎంపీ, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. రెంజల్‌లో శనివారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మూడు నెలల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు. మహిళలు దేవుడికి దండం పెటుకునేటప్పుడు కాంగ్రెస్ ఓడిపోవాలని కోరుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు పావల వడ్డీ అందించడం లేదని విమర్శించారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా ప్రతీ ఒక్కరికి జిల్లాలోని 30 కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందించేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. ఉపాధి కూలిని రూ.300కు పెంచిన ఘనత బీజేపీకి దక్కుతుందన్నారు. కందకుర్తి, బాసర, నందిపేట్ బ్యాక్ వాటర్ ప్రాంతాలను టూరిజం కేంద్రంగా మారుస్తానని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి గాడిద గుడ్లను వెంట పెట్టుకుని తిరుగుతున్నాడని, ఆయన చెప్పిన ఆరు గుడ్ల సంగతేంటని ప్రశ్నించారు. కొత్త పెన్షలు, రేషన్‌కార్డులు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని ఆరోపించారు. మోదీ కరోనా సమయంలో ప్రజలకు రెండు డోసుల ఇంజెక్షన్లు ఉచితంగా అందించి ప్రాణాలు కాపాడటమే కాకుండా 145 దేశాలకు వ్యాక్సిన్‌ను సరఫరా చేశారని గుర్తు చేశారు. బీజేపీకి ఓటేసి ధర్మాన్ని గెలిపించాలని కోరారు. వడ్డి మోహన్‌రెడ్డి, మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, ఎంపీపీ లోలపు రజని, జెడ్పీటీసీ విజయ, గోపికృష్ణ, సంతోష్, శ్రీనివాస్, కిశోర్, పోచయ్య, రాజు, యోగేశ్ పాల్గొన్నారు.



రెంజల్‌లో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

క్లుప్తంగా

కాలువలో చెత్త తొలగింపు



సాక్షి ఎఫెక్ట్‌..

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి నీటిని సరఫరా చేసే లక్ష్మికాలువలో భారీగా చెత్తపేరుకు పోవడంతో 'సాక్షి' దినపత్రికలో 'కాలువలో పేరుకు పోయిన చెత్త' శీర్షికన శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు ఉపాధి హామీ కూలీలతో చెత్త తొలగింపు పనులను శనివారం ప్రారంభించారు. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఫైన్‌తో 'బ్యాక్‌లాగ్‌' ఫీజు చెల్లింపునకు అవకాశం

నిజామాబాద్‌ అర్బన్‌: డా బీఆర్‌ అంబేద్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీలో 2017 సంవత్సరానికి చెందిన డిగ్రీ విద్యార్థులు బ్యాక్‌లాగ్‌ పరీక్ష ఫీజు చెల్లించాలని కో ఆర్డినేటర్‌ రంజిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో ఈనెల 6వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుముతో 13వ తేదీ వరకు ఫీజు చెల్లించాలని సూచించారు. ఒక్కో పేపర్‌కు రూ.150 చొప్పున ఆన్‌లైన్‌ కేంద్రాల్లో ఫీజు చెల్లించాలని, ఈనెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 17 నుంచి 22వ తేదీ వరకు డిగ్రీ మూడో సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈనెల 24 నుంచి 29 వ తేదీ వరకు డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయని వివరించారు.

డిపార్ట్‌మెంటల్‌ పరీక్ష తేదీల మార్పు

నిజామాబాద్‌అర్బన్‌: పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో డిపార్ట్‌మెంటల్‌ టెస్టు పరీక్షల తేదీలను మార్చారు. ఈనెలలో పరీక్షలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ వాయిదా వేశారు. వచ్చే నెల 12, 13 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.

కొనసాగుతున్న కళాశాలల తనిఖీలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో 2024–25 విద్యాసంవత్సరానికిగాను యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు కోసం డిగ్రీ, పీజీ కళాశాలల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ నేతృత్వంలో శనివారం కామారెడ్డి జిల్లాలోని ఎస్‌ఆర్‌కే కాలేజీ, పీజీ కాలేజీ, ఆర్‌కే, వీఆర్‌కే, మంజీరా, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలతోపాటు ఆర్‌కే హోటల్‌ మేనేజ్‌మెంట్‌ కళాశాలలో తనిఖీలు నిర్వహించారు. యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి, యూనివర్సిటీ నిర్దేశించిన నిబంధనల మేరకు వసతి సౌకర్యాలు ఉన్నాయా? లేవా? అని పరిశీలించారు.

తనిఖీల్లో ఆడిట్‌సెల్‌ జాయింట్‌ డైరెక్టర్‌ అతిక్‌ సుల్తాన్‌ ఘోరీ, డీన్స్‌ రాంబాబు, అపర్ణ, ఆరతి, లావణ్య, మేనేజ్‌మెంట్‌ విభాగం అధిపతి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ కమిటీలు నామమాత్రమేనా?

- పాఠశాలల అభివృద్ధి, మౌలిక సదుపాయాల బాధ్యత అప్పగింత
- నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ నాయకుల జోక్యం
- ఇష్టారాజ్యంగా పనుల కేటాయింపు



అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపికైన పాలెం ఉన్నత పాఠశాల భవనం

మోర్తాడ్‌(బాల్కొండ): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు నిధులను విడుదల చేసిన ప్రభుత్వం.. పనుల కేటాయింపు బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించింది. తొలి విడతలో జిల్లాలో 792 పాఠశాలలకు రూ.31.08 కోట్లు విడుదలయ్యాయి. అయితే, కొందరు నాయకుల జోక్యంతో పనుల కేటాయింపు పూర్తికావడంతో అమ్మ ఆదర్శ కమిటీలు నామమాత్రంగానే ఉండిపోయాయి. కాంట్రాక్టర్ల అవతారమెత్తిన అధికార పార్టీ నాయకులకు పాఠశాలల్లో చేపట్టనున్న పనుల బాధ్యతలను నామినేషన్‌ పద్ధతిలో అప్పగించారు. అధికార పార్టీ నాయకుల జోక్యంతో పనులను పర్యవేక్షించే ఇంజినీర్లు నోరు మెదపలేకపోతున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరం కింద తొలి విడతలో ఎంపికైన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల మరమ్మతులు, నీరు, విద్యుత్‌ సౌకర్యాల పునరుద్ధరణ, చిన్నచిన్న మరమ్మతులకు నిధులను విడుదల చేశారు. అన్ని రకాల సౌకర్యాల కోసం నిధులను విడుదల చేయగా, జూన్‌ 10వ తేదీలోగా పనులను పూర్తి చేయాలని విద్యాశాఖ నిర్దేశించింది. మహిళా సమాఖ్య సభ్యులతో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు సరైన కాంట్రాక్టర్‌లను గుర్తించి మరమ్మతులు, సౌకర్యాల పునరుద్ధరణ, ఇతర అభివృద్ధి పనులను పూర్తి చేయించాల్సి ఉంది. అమ్మ ఆదర్శ కమిటీల ఖాతాల్లో నిధులను జమ చేయగా వారి ద్వారానే బిల్లులు చెల్లించాల్సి ఉంది. కమిటీలకు పాఠశాలల బాధ్యతలను అప్పగిస్తే బడులు బలపడుతాయని ప్రభుత్వం ఆశించింది. 2024–25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల సంఖ్యను పెంచడానికి కమిటీలు కృషి చేస్తాయని విద్యాశాఖ నిర్ణయించింది. అయితే, ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడిచేలా జిల్లాలో అనేక పాఠశాలల పనులను అధికార పార్టీతో అంటకాగుతున్న కాంట్రాక్టర్లకు అప్పగించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిటీల జోక్యం లేకుండానే పనులు కేటాయింపు జరిగిపోయింది. నాయకులు సూచించిన వారికి పనులను అప్పగించడంతో నాణ్యతపై ప్రశ్న తలెత్తుతోంది.

ప్రభుత్వ పెద్దలు గుర్తించాలి



అమ్మ ఆదర్శ కమిటీల చొరవతో చేపట్టాల్సిన పనుల్లో నాయకులు జోక్యం చేసుకుంటున్నారు. ఈ కారణంగా పనుల్లో నాణ్యత లేకుండాపోతోంది. ప్రభుత్వ పెద్దలు దీనిని గుర్తించాలి. ఏ ఆశయంతో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశారో ఒకసారి ఆలోచించాలి.

– నల్ల నవీన్‌కుమార్‌, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

ఓటు వజ్రాయుధం వంటిది



యువకులతో మాట్లాడుతున్న ట్రెయినీ ఐపీఎస్‌ అధికారిణి చైతన్యరెడ్డి

నిజామాబాద్‌ రూరల్‌: ఓటు వజ్రాయుధం వంటిదని, అర్హులందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ట్రెయినీ ఐపీఎస్‌ అధికారిణి చైతన్యరెడ్డి అన్నారు. సంబంధిత అధికారులు పోలింగ్‌బూత్‌లలో ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. మండలంలోని గుండారంలో 10,11,12 బూత్‌లను శనివారం ఆమె పరిశీలించారు. నూతన ఓటర్లు తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. గుండారం పాఠశాలలో ఉన్న యువకులతో మాట్లాడిన చైతన్యరెడ్డి.. మీకు ఓటు హక్కు వచ్చిందా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు ప్రలోభాలకు లోనుకావొద్దన్నారు. దేశానికి మంచి నాయకులను ఎన్నుకోవడంలో యువత పాత్ర ఎంతో కీలకమని అన్నారు. పోలింగ్‌ బూత్‌ల పరిసరాల్లో 144 సెక్షన్‌ అమలులో ఉంటుందన్నారు. ఆమె వెంట ఏఎస్సై పరమేశ్వర్‌ తదితరులున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



కామారెడ్డి క్రైం : అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ అన్నారు. కామారెడ్డి మండలం టేక్రియాల్‌ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న నీటి ట్యాంక్‌ నిర్మాణం పనులను శనివారం పరిశీలించారు. మరుగుదొడ్ల మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ సాయన్న, ఏఈ సుబ్బారాయుడు, అధికారులు పాల్గొన్నారు.

జనసభకు ఏర్పాట్లు పూర్తి

- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా
- అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌, జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి

సుభాష్‌నగర్‌: నగరంలోని గిరిరాజ్‌ కళాశాల మైదానంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బీజేపీ విశాల జనసభను నిర్వహిస్తున్నట్లు అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి తెలిపారు. సభకు ముఖ్యఅతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌ షాతోపాటు రాజ్యసభ ఎంపీ డాక్టర్‌ కె లక్ష్మణ్‌, సంఘటన మంత్రి చంద్రశేఖర్‌, ఎంపీ అర్వింద్‌ ధర్మపురి హాజరుకానున్నారని తెలిపారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమన్నారు. ప్రజలందరూ ముక్తకంఠంతో మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. నిజామాబాద్‌ పార్లమెంట్‌ పరిధిలో మరోసారి బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తంచేశారు. విశాల జనసభకు ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమయ్యారన్నారు. సమావేశంలో నాయకులు అరుసు, రూరల్‌ ప్రభారీ బాల్‌రెడ్డి, నాయకులు, కార్పొరేటర్లు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, స్వామియాదవ్‌, ప్రమోద్‌కుమార్‌, బద్దం కిషన్‌,నారాయణయాదవ్‌ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ

ఈవీఎంలను సిద్ధం చేయాలి



బోధన్‌లో పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ

బోధన్‌: లోక్‌సభ ఎన్నికలకు ఈవీఎంలను సిద్ధం చేయాలని, తప్పిదాలకు తావు లేకుండా కమిషనింగ్‌ ప్రక్రియ నిర్వహించాలని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు సూచించారు.పోలింగ్‌ కేంద్రాల వారీగా కమిషనింగ్‌ జరిపించాలని సహాయ రిటర్నింగ్‌ అధికారులను ఆదేశించారు. బోధన్‌లోని విజయ మేరి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని శనివారం కలెక్టర్‌ సందర్శించారు. అనంతరం తహసీల్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్‌ బ్యాలెట్‌ ఫెసిలిటేషన్‌ సెంటర్‌ను పరిశీలించారు. ఆర్డీవో అంబదాస్‌ రాజేశ్వర్‌, తహసీల్దార్‌ గంగాధర్‌ తదితరులుఆయన వెంట ఉన్నారు.

డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్ల పరిశీలన

డిచ్‌పల్లి: సీఎంసీ కళాశాలలో నిజామాబాద్‌ అర్బన్‌, నిజామాబాద్‌ రూరల్‌ అసెంబ్లీ నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్‌, రిసీవింగ్‌ సెంటర్లను నిర్వహిస్తున్నారు. కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం సీఎంసీలో కమిషనింగ్‌ ప్రక్రియను పరిశీలించారు. బ్యాలెట్‌ యూనిట్లు, వీవీప్యాట్లలో బ్యాలెట్‌ పేపరు, అభ్యర్థులకు కేటాయించబడిన ఎన్నికల గుర్తులను ఫీడ్‌ చేస్తున్న తీరును పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు తప్పకుండా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. కలెక్టర్‌ వెంట నగరపాలక సంస్థ కమిషనర్‌ మకరంద్‌, నిజామాబాద్‌ ఆర్డీవో రాజేంద్రకుమార్‌ తదితరులున్నారు.

ధాన్యం సేకరణ ముమ్మరం చేయాలి

- అదనపు కలెక్టర్‌ చంద్ర మోహన్‌

కామారెడ్డి క్రైం: ధాన్యం సేకరణను ముమ్మరం చేయాలని అదనపు కలెక్టర్‌ చంద్ర మోహన్‌ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. శనివారం కామారెడ్డిలోని మార్కెట్‌ కమిటీ, రామేశ్వర్‌పల్లిలలో కొనుగోలు కేంద్రాలను, క్యాసంపల్లి, ఉగ్రవాయి గ్రామాల్లోని రైస్‌ మిల్లులను తనిఖీ చేశారు. నిర్వాహకులకు, రైస్‌మిల్లు యజమానులకు, లారీ ట్రాన్స్‌పోర్ట్‌ కాంట్రాక్టర్లకు, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలు పడనున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి పూట కూడా ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం రాసులు తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైన టార్పాలిన్లను కేంద్రాల నుంచి తీసుకొని ధాన్యం కుప్పలపై కప్పాలని రైతులకు సూచించారు. రైతులకు వడదెబ్బ తగలకుండా నీడ, తాగునీరు, ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు 325 కొనుగోలు కేంద్రాల ద్వారా 31,143 మంది రైతుల నుంచి సుమారు రూ. 387 కోట్ల విలువ గల 1,75,644 మెట్రిక్‌ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రూ. 277 కోట్లను రైతుల ఖాతాలో జమచేశామని తెలిపారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌ నిత్యానందం, డీటీలు పాల్గొన్నారు.

కామారెడ్డిలో దొంగల అలజడి



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని కాకతీయనగర్‌ కాలనీలో దొంగల ముఠా సంచారం కలకలం రేపింది. ఐదుగురు సభ్యులు ఉన్న ముఠా అర్ధరాత్రి వేళల్లో దేవునిపల్లి పరిధిలోని కాకతీయ నగర్‌ లో సంచరిస్తుండగా సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. చెడ్డీలు వేసుకుని వచ్చిన దుండగులు కాలనీలోని పలు ఇళ్లలో చోరీకి ప్రయత్నించారు. దీంతో పట్టణవాసులు ఆందోళనకు గురవుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

క్రైం కార్నర్‌

వడదెబ్బతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖలీల్‌వాడి: వడదెబ్బ కారణంగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు మూడో టైన్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ శనివారం తెలిపారు. శ్రద్ధానంద్‌ గంజ్‌ గేట్‌–2 వద్ద శుక్రవారం సాయంత్రం 4 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు గమనించి జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాత్రి సమయంలో మృతి చెందాడు. మృతదేహం జీజీహెచ్‌ మార్చురీలో ఉందని, మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే డయల్‌ 100 లేదా టౌన్‌ సీఐ(87126 59836) లేదా ఎస్సై(87126 59839) నంబర్లను సంప్రదించాలని ఎస్సై ప్రవీణ్‌ సూచించారు.

అనారోగ్యంతో మాజీ కౌన్సిలర్‌ ..

బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని తట్టికోట్‌ కాలనీకి చెందిన భారతీయ జనతా పార్టీ మాజీ కౌన్సిలర్‌ బొడ్డు రవి(46)అనారోగ్యం కారణంగా శనివారం మృతి చెందాడని పార్టీ వర్గాలు తెలిపాయి. మృతుడికి భార్య రజిని, కుమార్తె, కుమారుడు ఉన్నారు. నెల రోజుల క్రితం గుండెపోటు రావడంతో రవి అనారోగ్యానికి గురయ్యాడని నాయకులు తెలిపారు.

సేల్స్‌టాక్స్‌ అధికారులమని బెదిరింపులు

- నలుగురు విలేకరుల అరెస్ట్‌, రిమాండ్‌

రామారెడ్డి: సేల్స్‌ టాక్స్‌ డిపార్ట్‌మెంట్‌ అధికారులమని చెప్పి ఒకరిని బెదిరించిన నలుగురు విలేకరులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. సదాశివ నగర్‌ పోలీస్‌ స్టేషన్‌లో శనివారం కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పెర్కిట్‌ గ్రామానికి చెందిన నిఖిల్‌ ఈ నెల 2వ తేదీన రాత్రి హైదరాబాద్‌ నుంచి పెర్కిట్‌కు అశోక్‌ లేలాండ్‌ వాహనంలో గూడ్స్‌(సామగ్రి) తీసుకొని వెళ్తుండగా మల్లుపేట్‌శివారులో నలుగురు వ్యక్తులు కారులో వచ్చారు. గూడ్స్‌ వాహనాన్ని ఆపి తాము సేల్స్‌ టాక్స్‌ డిపార్ట్‌మెంట్‌ ఆఫీసర్లమని చెప్పి.. గూడ్స్‌ కు సంబంధించిన పత్రాలు చూపించాలన్నారు. ఈ క్రమంలో రూ.25 వేలు డిమాండ్‌ చేసి బెదిరింపులకు పాల్పడి నిఖిల్‌ వద్ద నుంచి రూ.3వేల నగదు ను లాక్కెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. చెన్నమగారి మహేశ్‌గౌడ్‌, కమ్మరి దత్తాద్రి, బత్తుల రాజేందర్‌, వేల్పుగొండ ప్రశాంత్‌ను నిందితులుగా గుర్తించారు. నలుగురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన సీఐ సంతోష్‌గౌడ్‌, ఎస్సై రాజు, ఏఎస్సై సాగర్‌, హెడ్‌కానిస్టేబుల్‌ రామకృష్ణను ఎస్పీ సింధు శర్మ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



ప్రశాంత్‌ (ఫైల్‌)

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): మండలంలోని కంజర్‌ గ్రామంలోని తన ఇంట్లో గూపన్‌పల్లి ప్రశాంత్‌ (33) అనే యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గంగాధర్‌ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రశాంత్‌కు రెండేళ్ల క్రితం వివాహం కాగా, ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లి కొన్ని నెలలకే తిరిగి వచ్చాడు. మద్యానికి బానిసై తరచూ గొడవలు జరుగుతుండటంతో భార్య ఆరు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. మద్యం సేవించడం, అప్పులు పెరిగిపోవడం, భార్య సంసారానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి గూపన్‌పల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మృతదేహం ఉందనే సమాచారంతో పోలీసుల గాలింపు

నిజామాబాద్‌రూరల్‌: మండలంలోని మాధవనగర్‌ బైపాస్‌ రోడ్డు ప్రాంతంలో మృతదేహం ఉందని గుర్తుతెలియని వ్యక్తులు డయల్‌ 100కు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన డిచ్‌పల్లి, నిజామాబాద్‌ రూరల్‌ పోలీస్‌స్టేషన్ల సిబ్బంది రైల్వే ఓవర్‌ బ్రిడ్జి పనులు కొనసాగుతున్న ప్రాంతానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. అక్కడ పడి ఉన్న మూటను విప్పిచూడగా అందులో పాతబట్టలు ఉన్నాయి. పాతబట్టల మూటను చూసి మృతదేహం అనుకొని డయల్‌ 100కు ఫిర్యాదు చేశారని రూరల్‌ ఎస్‌హెచ్‌వో చైతన్యరెడ్డి, డిచ్‌పల్లి ఎస్సై మహేశ్‌ తెలిపారు.

కేసు నమోదు

ఎడపల్లి(బోధన్‌): మండలంలోని దుబ్బతండాలో పంచాయతీ కార్యదర్శి సాయికుమార్‌పై దాడి చేసిన ఘటనలో గ్రామానికి చెందిన దేవీసింగ్‌తోపాటు ఆయన భార్య నీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా నల్లా బిగింపు కోసం తాగునీటి పైప్‌ లైన్‌ను ధ్వంసం చేశారని, ఈ విషయమై ప్రశ్నించగా భార్యాభర్తలు కలిసి కార్యదర్శిపై దాడి చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రూ.1.47 లక్షల నగదు సీజ్‌



మాచారెడ్డి: మండలంలోని ఘన్‌పూర్‌ స్టేజీ వద్ద శనివారం సాయంత్రం పోలీసులు రూ.1,47,600 నగదు సీజ్‌ చేశారు. పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా సిరిసిల్ల నుంచి కామారెడ్డి వైపు వస్తున్న టాటా ఏస్‌ వాహనంలో నగదు పట్టుబడిందని ప్రత్యేకాధికారి విద్యాసాగర్‌, ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ తెలిపారు. ధ్రువపత్రాలు లేకపోవడంతో నగదును సీజ్‌ చేశామన్నారు.

అల్ప్రాజోలం పట్టివేత

ఖలీల్‌వాడి: ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు డిచ్‌పల్లి మండలంలోని మాధవనగర్‌ వద్ద యాదాగౌడ్‌ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అల్ప్రాజోలం సీజ్‌ చేసినట్లు తెలిసింది. ఎక్సైజ్‌ అధికారులు యాదాగౌడ్‌ను విచారించగా, ఓ కల్లు డిపోకు చెందిన ఒకరితోపాటు అల్ప్రాజోలం దందా చేసే మరొకరి పేర్లను చెప్పినట్లు సమాచారం. దీంతో అధికారులు ఆ ఇద్దరి ఇళ్లలో తనిఖీలు చేయగా, వారిపై కేసు కాకుండా డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఓ అధికారి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా జిల్లాలో అల్ప్రాజోలం, గంజాయితోపాటు ఇతర మాదకద్రవ్యాలను అరికట్టే అంశాన్ని ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు విస్మరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసుల అదుపులో మత్తుమందు విక్రయ వ్యాపారులు..?

భిక్కనూరు : అల్ప్రాజోలం విక్రయిస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామ శివారులో టాస్క్‌ఫోర్స్‌ అధికారులు నిఘా వేసి ఓ కారును పట్టుకున్నారు. కారును తనిఖీ చేసి అల్ప్రాజోలం తరలిస్తున్నట్లు గుర్తించారు. కారులో ఉన్న గాంధారికి చెందిన వ్యక్తి ఒకరు, బాన్సువాడ నుంచి ఒకరు, నిజామాబాద్‌లోని ఎడపల్లి ప్రాంతానికి చెందిన ఒకరు, పెద్దమల్లారెడ్డికి చెందిన ఒకరిని టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పట్టుబడిన అల్ప్రాజోలం విలువ తెలియాల్సి ఉంది.

సీసీఎస్‌ పోలీసుల అదుపులో యువకుడు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడిని సీసీఎస్‌ పోలీసులు శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అల్ప్రాజోలం వ్యాపారంలో యువకుడి ప్రమేయం ఉందనే అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై స్థానిక ఎస్సై ఆంజనేయులును వివరణ కోరగా.. కేసుకు సంబంధించిన వివరాలు తమకు తెలియదని, ఓ యువకుడిని అదుపులోకి తీసుకుంటున్నట్లు మాత్రమే సమాచారం ఇచ్చారని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో పేకాటస్థావరంపై శనివారం దాడి చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5,850 నగదుతోపాటు ఎనిమిది సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌ పోలీసులతో కలిసి దాడి చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు ప్రాంతాలకు చెందిన నలుగురి అదృశ్యం

కామారెడ్డి క్రైం: సిరిసిల్ల జిల్లా వీర్నపల్లికి చెందిన ఓ యువతి జిల్లా కేంద్రం నుంచి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ నెల 3వ తేదీన కామారెడ్డిలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి వచ్చిన యువతి, కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకి వెళ్ళిపోయిందన్నారు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో యువతి తల్లి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

భూంపల్లికి చెందిన మహిళ..



గాంధారి(ఎల్లారెడ్డి): సదాశివనగర్‌ మండలం భూంపల్లికి చెందిన సంగజాడ రాజవ్వ అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గాంధారిలో ఉంటున్న తన సోదరుడు సాయిప్రదీప్‌ వద్దకు గత నెల 30న వచ్చిన రాజవ్వ.. ఈనెల ఒకటో తేదీని స్వగ్రామానికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. ఇప్పటి వరకు రాజవ్వ భూంపల్లికి చేరకపోవడంతో ఆమె కుమారుడు సంగజాడ రాజశేఖర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మతిస్థిమితం లేని యువకుడు..



గాంధారి మండల కేంద్రానికి చెందిన యువకుడు జైనపురం వినోద్‌ అదృశ్యమైనట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. మతిస్థిమితం లేని వినోద్‌ గత నెల 30వ తేదీన మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాకపోవడంతో అతడి సోదరుడు మధుబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాలంపాడ్‌కు చెందిన మహిళ..

బోధన్‌రూరల్‌(బోధన్‌): సాలూర మండలం సాలంపాడ్‌కు చెందిన లక్ష్మి(38) అదృశ్యమైనట్లు రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ తెలిపారు. లక్ష్మికి మహారాష్ట్రకు చెందిన వ్యక్తితో వివాహం కాగా, భర్తతో గొడవ కారణంగా ఆమె ఈనెల 2న స్వగ్రామానికి తిరిగివచ్చేసింది. 3వ తేదీన ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నగరంలో పట్టపగలు చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గోటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం పట్టపగలు చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పోస్టల్‌ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే మధుసూదన్‌ వినాయక్‌నగర్‌ 100ఫీట్ల రోడ్డులో నివాసం ఉంటున్నాడు. కారు కొనుగోలు చేసేందుకు శుక్రవారం షోరూమ్‌కు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంటితాళం పగులగొట్టి ఉంది. దుండగులు బీరువాను ధ్వంసం చేసి ఎనిమిది తులాల బంగారం, వెండి తదితర వస్తువులను ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హై ఓల్టేజీతో ఎలక్ట్రానిక్‌ వస్తువులు దగ్ధం

నిజాంసాగర్‌(జుక్కల్‌): మండలంలోని అచ్చంపేటలో హైఓల్టేజీ కారణంగా శనివారం పలు ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లతోపాటు పలు ఎలక్ట్రానిక్‌ వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఒక్కసారిగా హైఓల్టేజీ విద్యుత్‌ సరఫరా కావడంతో ఎలక్ట్రానిక్‌ వస్తువులు కాలిపోయి ఆస్తినష్టం సంభవించిందని గ్రామస్తులు తెలిపారు. ఇటువంటి సమస్య పునరావృతం కాకుండా విద్యుత్‌ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

మంటలు వ్యాపించి వరిపంట..

బాల్కొండ: మండలం నాగాపూర్‌ వరిపంటకు శనివారం నిప్పంటుకుంది. వరి కోత కోసిన తరువాత వ్యవసాయభూమిలోని కొయ్యలకు నిప్పు పెట్టగా మంటలు పక్కనే ఉన్న ఎంబరి మల్లేశ్‌కు చెందిన వరిపొలంలోకి వ్యాపించాయి. ఫైర్‌ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎకరం విస్తీర్ణంలో వరి దగ్ధమైంది. సుమారు రూ.70వేల నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపాడు. స్థానిక యువకులు మంటలను ఆర్పేందుకు చాలా శ్రమించారని ఫైర్‌ హెడ్‌కానిస్టేబుల్‌ శేఖర్‌ అన్నారు. పంటపొలాల వద్ద నిప్పు పెట్టొద్దని ఆయన సూచించారు.